సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 9 । డిసెంబర్ । 2023



మహా గురుకులం ప్రారంభానికి సిద్ధం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మహా గురుకుల పాఠశాల ఏర్పాటైంది. రూ. 21 కోట్లతో నూతన భవనాలు నిర్మించారు. -8లో



యాత్రను జయప్రదం చేయండి

రాజంపేటలో ఈ నెల 12న జరిగే సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.289
రెండోరకం	రూ.110	రూ.200



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 298 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	400
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 62.100 కిలోలు

న్యూస్‌రీల్

వైఎస్సార్ జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా జిల్లాలోని రెండు మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. వేముల మండలంలో 31.4 ఎంఎం, పులివెందులలో 8 ఎంఎం వర్షపాతం నమోదైంది. శనగ, ఇతర ఆరుతడి పంటల సాగుకు ఈ వర్షం అనుకూలించనుంది.

బీసీ కార్పొరేషన్ ఈడీగా జయసింహ



కడప రూరల్: బీసీ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా జయసింహ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సత్యసాయి జిల్లా మడకశిరలో డ్వామా ఏపీడీగా పనిచేస్తూ డెప్యుటేషన్‌పై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఈడీగా వ్యవహరించిన జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఈడీ బ్రహ్మయ్య స్థానంలోకి జయసింహ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

లేబర్ సెస్సు వసూలు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్: లేబర్ సెస్సును వసూలు చేసి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. భవన, ఇతర నిర్మాణ పనులలో కార్మికులకు భద్రతా ప్రామాణాలను పాటించేలా చూడాలన్నారు. ప్లాన్ అప్రూవల్ అథారిటీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

12న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: కలెక్టరేట్‌లో తమ కార్యాలయంలో ఈనెల 12వ తేదిన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ప్రముఖ కంపెనీల్లో వివిధ హోదాల్లో పనిచేసేందుకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, ఎం.ఫామ్, బి.ఫామ్ ఉత్తీర్ణులై 18-45 సంవత్సరాల వయస్సుకలిగిన వారు ఉద్యోగాలకు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకురూ. 12,500 నుంచి రూ. 40,000 వరకు హోదాను బట్టి వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు మంగవారం జరిగే ఇంటర్వ్యూలకు విద్యార్హతల జిరాక్స్ కాపీలతో రావాలన్నారు.

ఇంటర్ ఫీజు గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు నెల 11వ తేదీ వరకు ప్రభుత్వం గడుపు పెంచిందని ఇంటర్ డీవీఈఓ. శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐవో రమణరాజు తెలిపారు. వాస్తవానికి పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు ముగిసినా తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు, గతంలో ఫెయిలైన వారు, ప్రైవేటు విద్యార్థులు సైతం ఫీజులు చెల్లింపు చేసుకోవచ్చన్నారు.

తప్పులు సవరించుకోవాలి

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థులు ఎస్ఎస్‌సీ బోర్డుకు సమర్పించిన దరఖాస్తుల్లో తప్పులుంటే సవరించుకునేందుకు ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు బోర్డు అవకాశం కల్పించిందని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. విద్యార్థి తల్లితండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, మాధ్యమం, ఫొటో, సంతకం, మొదటి, రెండో భాష సబ్జెక్టు వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.

పరీక్షలు వాయిదా

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ 1, 3, 5 సెమిస్టర్ విద్యార్థులకు ఈ నెల 15 తేదీ నుంచి నిర్వహించాల్సిన పరీక్షలు వాయిదా వేశామని వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. పలు కళాశాలల నుంచి వచ్చిన వినతుల మేరకు వీసీ ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలు పరీక్షల తేదీల్లో మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పరీక్షల తేదీవారీగా టైం టేబుల్ సంబంధిత కళాశాలలకు పంపామన్నారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను పరీక్షల ప్రారంభానికి ముందు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్ నుంచి తీసుకోవాలని సూచించారు.

అన్ని పత్రాలు తప్పనిసరి

కడప వైఎస్సార్ సర్కిల్: ప్రతి వాహనదారుడు తమ వాహనం యొక్క అన్ని రకాల పత్రాలను కలిగి ఉండటం తప్పనిసరి అని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ. మీరాప్రసాద్ సూచించారు. కడప శివార్లలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనం యొక్క అన్ని పత్రాలను కలిగి ఉండాలన్నారు. నగరంలోని అన్ని కూడళ్లలో సీసీ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనలపై నిఘా ఉంచామన్నారు. కాగా, 2021 ఆగస్టు నుంచి 2023 జులై వరకు పెండింగ్‌లో ఉన్న డ్రైవింగ్, ఆర్సీ కార్డులను ప్రింట్ చేసి వాహనదారులకు పోస్ట్ ద్వారా పంపడం జరిగిందన్నారు. విద్యార్థులను తరలించే వాహనాలు, ట్యాక్స్‌లు చెల్లించని వాహనదారుల కోసం ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం



మాట్లాడుతున్న ఓపెన్‌మైండ్స్ అధ్యక్షుడు డా. ఎస్. రాజశేఖరరెడ్డి



సదస్సుకు హాజరైన విద్యార్థులు, మేధావులు తదితరులు

- విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- 'ఓపెన్ మైండ్స్'సెమినార్‌లో వక్తలు

వైవీయూ: విద్య, వైద్య రంగాలతో పాటు సంక్షేమ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు, ప్రాధాన్యత ఫలితాలు..రానున్న రోజుల్లో కనిపిస్తాయని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు ఇస్తున్న ప్రాధాన్యతతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే సుస్థిరమైన అభివృద్ధి సాధిస్తోందని పలువురు వక్తలు, యువత పేర్కొన్నారు. కడప లోని అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శుక్రవారం 'ఓపెన్ మైండ్స్'(ఫార్ బెటర్ సొసైటీ) స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో 'విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో వినూత్న మార్పులు - సుస్థిర అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్'అన్న అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఓపెన్ మైండ్స్ సంస్థ ప్రెసిడెంట్, ఏపీ ఉన్నతవిద్య మానిటరింగ్ కమిటీ పూర్వపు సీఈఓ, మెంబర్ సెక్రటరీ డాక్టర్ ఎస్. రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రజాహిత కార్యక్రమాలు, సమస్యలపై పోరాటం, అవగాహన కల్పించడమే లక్ష్యంగా, ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఏర్పాటైన సంస్థ ఓపెన్ మైండ్స్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన గొప్ప మార్పులు, సంస్కరణలపై అవగాహన కల్పించడంతో పాటు ఏవైనా పొరపాట్లు, సవరణలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడమే లక్ష్యమన్నారు. దేశానికి స్వాతంత్రం సిద్ధించి 75 సంవత్సరాల కాలంలో ఎక్కువగా పారిశ్రామీకరణ, వ్యవసాయ రంగాలకే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. విద్య, వైద్య, సంక్షేమాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అయినప్పటికీ కొందరు ఈ రంగాలకు ప్రాధాన్యతను ఇవ్వడాన్ని విమర్శించడం సరికాదన్నారు, ప్రజలు, యువత, మేధావులు సరైన దిశగా సానుకూల దృక్పథంతో ఆలోచన చేసి, జరుగుతున్న అభివృద్ధిపై విశ్లేషించుకోవాలన్నారు.విద్యపై పెడుతున్న ఖర్చును పెట్టుబడిగా భావించాలని రానున్న రోజుల్లో అత్యున్నత మానవ వనరులను, మేధోసంపత్తిని దేశం పొందుతుందన్నారు.వైద్యరంగంలో ఆరోగ్యశ్రీకి మహానేత వైఎస్ఆర్ శ్రీకారం చుడితే.. దాన్ని సీఎం వైఎస్ జగన్ మరింత బలోపేతం చేస్తూ విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ వంటి పథకాలతో ప్రజలకు మరింత దగ్గరయ్యారన్నారు. ఇప్పటి వరకు 11 మెడికల్ కళాశాలలు ఉండగా, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చట్టడం, దాదాపు 6వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి రానుండటం ఇవన్నీ అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ఎక్కువ విమర్శలు ఎదుర్కొంటున్న రంగం సంక్షేమరంగమన్నారు. ఉచితాలు ఇస్తున్నారని విమర్శలు చేసేవారు ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో 1.25 లక్షల సచివాలయ ఉద్యోగాలు, 2 లక్షల మంది వలంటీర్లను ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న సుపరిపాలనను గ్రామస్థాయికి తీసుకువెళ్లడం కన్నా అభివృద్ధి ఏముంటుందని ప్రశ్నించారు. వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు డా. ఎస్. ఈశ్వరరెడ్డి, విశ్రాంత ఆచార్యులు డా. గులాంతారీఖ్, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, శ్రీహరి డిగ్రీ కళాశాల అధినేత జి. సుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు ఎస్.వి. డిగ్రీ కళాశాల అధినేత హరినారాయణ పాల్గొన్నారు.

పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి..విద్య



విద్యనే పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటి వరకు ఏ సీఎం ఇవ్వని ప్రాధాన్యతను విద్య, వైద్యరంగాలకు ఇస్తున్నారు. ఒకప్పటి ప్రభుత్వ పాఠశాలలకు, నాడు-నేడు తర్వాత ప్రభుత్వ పాఠశాలలను చూస్తే అభివృద్ధి కళ్లకు కట్టినట్టు కనిపిస్తుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తీసుకురాగా, దానిని మరింత మెరుగుపరిచి నిబంధనలు లేకుండా జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనలు సీఎం జగన్ తీసుకువచ్చారన్నారు. - చొప్పా గంగిరెడ్డి, అన్నమాచార్య విద్యాసంస్థల చైర్మన్

దేశంలోనే అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్



తెలుగుమీడియంలో చదువుకుని ఇంగ్లీషు మాట్లాడటంలో తడబడ్డ మాలాంటి వారెందరికీ ప్రభుత్వం ఇప్పుడు తీసుకువచ్చి ఇంగ్లీషు మీడియం పాఠశాలలను చూస్తే సంతోషం కలుగుతోంది. న్యాయవాదుల కోసం రూ.5వేలు చొప్పున లా నేస్తం పథకం ద్వారా అందించడం చారిత్రాత్మం వినూత్న సంస్కరణలకు కేరాఫ్ అడ్రస్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, విద్యార్థులు, ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని స్థిరమైన అభివృద్ధి సాధించాలి. - రాఘవరెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

పరిపాలనను గమనించాలి



రాజకీయ పార్టీల గురించి, చరిత్ర, విశ్వసనీయత, పరిపాలన గురించి విద్యార్థులు నిశితంగా పరిశీలించాలి. ప్రతి విద్యార్థి ఓపెన్ మైండ్‌తో ఆలోచిస్తే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు, అందిస్తున్న పథకాల గురించి అర్థమవుతుంది. రాష్ట్రంలో ప్రతి పథకం సక్రమంగా ప్రజలకు చేరుతున్నాయంటే పరిపాలన ఎంత పకడ్బందీగా, పారదర్శకంగా ఉందో అర్థం చేసుకోవాలి. - జయసింహ, ఇన్‌చార్జి స్టేషన్ డైరెక్టర్, ఆకాశవాణి, కడప కేంద్రం

వైఎస్సార్ కలను.. జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు



రాష్ట్రంలో పాఠశాలవిద్యలో ఇంగ్లీషు మీడియం పాఠశాలలు నెలకొల్పాలన్న వైఎస్సార్ కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. పేదవాళ్లు తమ పిల్లలను ఇంగ్లీషు మీడియంలో చదివించడం, వారికి సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వానికి అభినందనలు. అప్పుల గురించి చాలామంది మాట్లాడుతున్నారు. పరిపాలనలో అది అత్యంత సహజమైన విషయం - పోచంరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ

మహిళా సాధికారతకు పెద్దపీట



విద్య, వైద్యం, సంక్షేమ రంగాలతో పాటు మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల రక్షణ కోసం దిశ యాప్, అన్నింటా మహిళలకు రిజర్వేషన్లు, నామినేటెడ్ పోస్టుల్లో సైతం మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరం. గతంతో పోల్చితే నేడు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాం. విద్యారంగంలో ఎవరూ తీసుకురానన్ని మార్పులు తేవడంను యువత ఆహ్వానిస్తోంది. - కవిత, సాయిపరమేశ్వర డిగ్రీ కళాశాల, జమ్మలమడుగు

అన్ని సౌకర్యాలు పొందుతున్నాం..



ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను అందిపుచ్చుకుని విద్యాభ్యాసం చేస్తున్నాం. మేము పాఠశాలలో చదివే సమయంలో ఇప్పుడున్నన్ని సౌకర్యాలు లేవు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చింది. విద్యతోనే ప్రగతి సాధ్యమని నమ్మే పాలకులు ఉండటం మనందరి అదృష్టం. ప్రభుత్వంపై చేసే ఫేక్ ప్రచారాలకు యువత దూరంగా ఉండాలి. - సుదీప్తి, బీటెక్, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, కడప

ప్రొద్దుటూరులో సినీ తారల సందడి





షాపింగ్‌మాల్ ప్రారంభానికి వచ్చిన రష్మి, మాట్లాడుతున్న సినీ నటి పాయల్ రాజ్‌పుత్

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణంలోని మైదుకూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను శుక్రవారం ప్రారంభించారు. సినీ నటీమణులు పాయల్ రాజ్‌పుత్, రష్మి చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై అభిమానం చూపి స్వాగతం పలికిన ప్రొద్దుటూరు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 28 బ్రాంచిలను ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రొద్దుటూరులో 29వ బ్రాంచి తమ చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అందరికి అందుబాటులో ధరలు, మన్నికకు మారుపేరుగా సీఎంఆర్ షాపింగ్ మాల్ నిలుస్తుందన్నారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకటరమణ, వెంకటపద్మావతి, వెంకటబాలాజీ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధరలను నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మునీర్, గరిశపాటి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

11న గండిలో టెండర్లు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధికి సంబంధించి ఖాజీపేట,చక్రాయపేట మండలాల్లో ఉన్న భూమిని కౌలుకు ఇచ్చే నిమిత్తం ఈనెల 11న షీల్డ్ టెండరు, బహిరంగవేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు.ఖాజీపేట మండలంలో ఉన్న 1.55 ఎకరాలు, చక్రాయపేట మండలంలోని 0.10 సెంట్ల భూమిని 2 సంవత్సరాల కాల వ్యవధితో ఇవ్వనున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనే వారు రు.5 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.అలాగే సంవత్సర కాలం పాటు స్వామి వారి అలంకరణకు పూలు సరఫరా చేయడానికి రు.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని చెప్పారు.షాపింగ్ కాంప్లెక్ నందు గల ఖాళీ గదులను అద్దెకు పొందాలను కునేవారు 30 వేలు డిపాజిట్ చెల్లించాలని చెప్పారు..పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: పేదల సంక్షేమంకోసం ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం ద్వారా మంజూరైన మురుగునీటి శుద్ధి వాహనాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తోందన్నారు. జిల్లాలో స్వచ్ఛత ఉద్యమ యువజన పథకంలో భాగంగా మున్సిపాల్టీ పరిధిలో పని చేస్తున్న సఫాయి కర్మచారుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. 31.67 లక్షలు విలువచేసే మురుగునీటి శుద్ధి వాహనాన్ని మంజూరు చేసినట్లు చెప్పారు. ఇందులో ప్రభుత్వ సబ్సిడీ రూ. 15.06 లక్షలు పోగా మిగిలిన రూ. 16,60,946లు 72 కంతులలో లబ్దిదారుడు తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డీఈ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



మురుగునీటి శుద్ధి వాహనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

సోమశిల.. కళకళ

- 2 టీఎంసీల మిచాంగ్ జలాలు
- ఉధృతంగా ప్రవహించిన గుంజన చెయ్యేరు, బాహుదా, పింఛా నదులు
- తుపాను ప్రభావం లేని వెలిగల్లు ప్రాజెక్టు

బి.కొత్తకోట: మిచాంగ్ తుపాను ప్రభావంతో అన్నమయ్యజిల్లాలో కురిసిన భారీ వర్షాలకు సుమారు రెండు టీఎంసీల వరద జలాలు సోమశిల ప్రాజెక్టులోకి చేరాయి. జిల్లాలో నీటి నిల్వకు అవకాశం లేకపోవడంతో స్థానికంగా సద్వినియోగం చేసుకునే పరిస్థితి లేకపోయింది. ఈనెల 4-5 తేదీల్లో జిల్లాలో మిచాంగ్ తుపాను ప్రభావం తీవ్రంగా చూపింది. జిల్లా తూర్పు ప్రాంతాల్లో మాత్రమే భారీ వర్షాలు నమోదయ్యాయి.

కోడూరులో 356 మి.మీ వర్షం

జిల్లాలోని 30 మండలాల్లో.. తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో మిచాంగ్ తుపాను ప్రభావం తక్కువ. మిగిలిన మండలాల్లో అత్యధిక వర్షపాతం కోడూరులో నమోదైంది. ఈనెల 4 నుంచి 6 వరకు కోడూరులో 356.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చిట్వేలిలో 292.6, పెనగలూరులో 259.2, నందలూరులో 153.6, చిన్నమండెంలో 103.4, సంబేపల్లెలో 114.4, టి.సుండుపల్లెలో 131.8, రాజంపేటలో 146.2, పుల్లంపేటలో 108.2, ఓబులవారిపల్లెలో 184.4, కలకడలో 101, కేవిపల్లెలో 133.2, పీలేరులో 117.6, కలికిరిలో 121.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గాలివీడులో 75 మి.మీ, రాయచోటిలో 83, లక్కిరెడ్డిపల్లెలో 66.2, రామాపురంలో 76, వీరబల్లిలో 88.6, తంబళ్లపల్లెలో 55.4, పెద్దమండ్యంలో 91, గుర్రంకొండలో 87.2, కురబలకోటలో 63.6, పెద్దతిప్పసముద్రంలో 43.2, మదనపల్లెలో 49.6, నిమ్మనపల్లెలో 50.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.



ప్రవహిస్తున్న చెయ్యేరు నది

4 మండలాల్లో అత్యల్పం

తుపాను ప్రభావంలోనూ నాలుగు మండలాల్లో అత్యల్ప వర్షం కురిసింది. పెద్దతిప్పసముద్రంలో 12.2 మిల్లీమీటర్లు, రామసముద్రంలో 9.8, ములకలచెరువులో 11.8, బి.కొత్తకోటలో 27.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కాగా జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైన మండలాల్లో భూగర్భ జలాలు వృద్ధి కానున్నాయి. వ్యవసాయం, తాగునీటికి ఇబ్బందులు ఉండవు.

వెలిగల్లు నుంచి పెన్నాలోకి 24 టీఎంసీలు

తుపానులు, భారీ వర్షాలు కురిసినప్పుడు జిల్లాలో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో నీళ్లన్నీ పెన్నా పాలవుతోంది. వర్షపునీళ్లు రెండు టీఎంసీల దాక పెన్నాలో కలిసి సోమశిలకు చేరాయి. గత ఏడాదిలో పరిస్థితిని పరిశీలిస్తే..తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల నుంచి (ఎగువన కర్ణాటక నుంచి వచ్చే నీళ్లు కలుపుకుని) ప్రాజెక్టులోకి 25 టీఎంసీల నీరు చేరింది. ఈ స్థాయిలో నీరు నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో జలవనరులశాఖ వెలిగల్లు ప్రాజెక్టు నుంచి 25.913 టీఎంసీల నీళ్లు విడుదల చేయగా పెన్నా నదిలో కలిసిపోయాయి. ఇంతటి స్థాయిలో నీటిని జిల్లాలో సద్వినియోగం చేసుకోవడం, నిల్వ చేసుకునే ప్రాజెక్టులు లేకపోవడంతో నీళ్లన్ని పెన్నాలోకి వదలాల్సి వస్తోంది.


నిండుగా నదులు

మిచాంగ్ తుపానుకు జిల్లాలోని నదులు నిండుగా ప్రవహించాయి. తిరుపతిజిల్లా తిరుమల పైనున్న పాపవినాశం డ్యామ్ నిండింది. అక్కడినుంచి వాగేటి వాగులో కలిశాక నీటి ప్రవాహ ఉధృతి పెరిగింది. డ్యామ్ నుంచి 8-10 వేల క్యూసెక్కుల నీళ్లు ప్రవహించగా కోడూరు దాటాక గుండాల ఏరు, గుంజానా నది కలిసిన ప్రాంతంలో నీటి ప్రవాహ సామర్థ్యం 20వేల క్యూసెక్కులకు పెరిగింది. కేవిపల్లె మండలంలోని ఝరికోన ప్రాజెక్టు నిండింది. దీంతో పింఛానదిలో 1,200 క్యూసెక్కుల నీళ్లు ప్రవహించాయి. నిమ్మనపల్లె మండలం నుంచి బాహుదా నదిలో 1,300 క్యూసెక్కులు, చెయ్యేరు నదిలో 5,600 క్యూసెక్కులు, అన్నమయ్య నుంచి 5,400 క్యూసెక్కుల నీళ్లు ప్రవహించాయి. ఈ నదుల నుంచి ప్రవహించిన వరద జలాలు అనంతరాజుపేట వద్ద చెయ్యేరు నుంచి పెన్నా నదిలోకి చేరిన ప్రవాహం చివరగా సోమశిల ప్రాజెక్టులోకి చేరాయి. పాపవినాశం డ్యామ్ నుంచి అత్యధికంగా అర టీఎంసీ నీళ్లు ప్రవహించాయి. మిచాంగ్ తుపానుతో పెద్దేరు, ఝరికోన ప్రాజెక్టులు నిండగా మొత్తానికి రెండు టీఎంసీల దాకా వరద జలాలు జిల్లా నుంచి సోమశిలకు చేరాయి. వర్ష ప్రభావం వెలిగల్లు ప్రాజెక్టుపై చూపలేదు. ఈ ప్రాజెక్టులోకి చుక్కనీరు చేరలేదు.



నిండి ప్రవహిస్తున్న ఝరికోన ప్రాజెక్టు

భూగర్భజలాలు పెరిగాయి



మిచాంగ్ తుపానుతో కురిసిన వర్షాలకు నదులు ప్రవహించాయి. నీళ్లు చెయ్యేరు నది నుంచి సోమశిల ప్రాజెక్టుకు చేరాయి. వర్షాల కారణంగా భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. తాగు, సాగు నీటికి సమస్యలు తీరుతాయి. వెలిగల్లు ప్రాజెక్టుకు తుపాను ప్రభావం లేదు. అయినప్పటికి నీటినిల్వ ఉంది. గత ఏడాది వెలిగల్లునుంచి నీటిని విడుదల చేయగా పెన్నా నదిలోకి వెళ్లాయి. ప్రస్తుతం ఈ పరిస్థితి లేదు. -కృష్ణమూర్తి జలవనరులశాఖ

క్లెయిమ్స్ పక్కాగా పరిశీలన చేస్తున్నాం

రాయచోటి: జిల్లాలో ఓటర్ జాబితాకు సంబంధించి వచ్చిన క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ పక్కాగా పరిశీలిస్తామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోజరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన దాదాపు పూర్తయిందన్నారు. డీఆర్ఓ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట ఆర్డీ ఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉండాలి

వాల్మీకిపురం: సామాన్య ప్రజలను నుంచి వచ్చే ప్రతి అర్జీకి సంబంధిత అధికారులు జవాబుదారీగా ఉండి, సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలసి ఆయన పాల్గొని, ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. వాటిని పరిశీలించి, అక్కడిక్కడే పరిష్కరించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా 1902కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఆర్డీవో మురళీ, డీఎల్‌పీవో నాగరాజ, డీఎల్‌డీవో లక్ష్మీపతి, మండల ప్రత్యేక అధికారి శివరామమూర్తి, ఎంపిడివో షబ్బీర్ అహ్మద్, తహశీల్దార్ ఫిరోజ్‌ఖాన్, జడ్పీటీసీ నిర్మల, సర్పంచ్ గంగులమ్మ, మార్కెట్ కమిటీ చైర్మెన్ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లీబిడ్డలు అదృశ్యం


బిడ్డ చారుతో శిరీష

మదనపల్లె : మదనపల్లె తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో తల్లీబిడ్డలు అదృశ్యమయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తపల్లె పంచాయతీ నెమలినగర్ వడ్డిపల్లెకు చెందిన భరత్‌కుమార్ భార్య శిరీష(26), తన కుమార్తె చారు(1)తో కలిసి ఈ నెల ఆరవ తేదీన అదృశ్యమైంది. తరచూ మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో భర్తతో గొడవ పడింది. మనస్తాపంతో కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి బయటకు వచ్చింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లభించలేదు. దీంతో గురువారం సాయంత్రం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్ఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

మండలంలోని బొమ్మనచెరువు పంచాయతీ టీకులపాలెంకు చెందిన మైనర్ బాలిక అదృశ్యమైంది. ఆమె ఇంటర్మీడియెట్ చదువుతుండగా ఈ నెల ఆరవ తేదీన బాలిక తండ్రి ద్విచక్రవాహనంలో మదనపల్లె పట్టణంలోని కాలేజీ వద్ద దింపి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని మహిళ మృతి

కేవీపల్లె : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన నారమాకులవడ్డిపల్లె బస్టాఫ్ వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ లోకేష్ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని నారమాకుల వడ్డిపల్లెకు చెందిన రేపన శ్రీనివాసులు, ఆయన కుమారుడు చిన్నరెడ్డెప్ప ద్విచక్రవాహనంలో పీలేరు వైపు నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అదే సమయంలో సుండుపల్లె మండలం బాగంపల్లెకు చెందిన సైఫుల్లా, తల్లి చాంద్ బేగం (60) పీలేరు వైపు నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. రాగులరేకులమిట్ట డౌన్‌లో రెండు వాహనాలు ముందు వెనుక వెళుతున్నాయి. ఈ సమయంలో ముందు వెళుతున్న ద్విచక్రవాహనం నారమాకులవడ్డిపల్లె వైపు తిప్పడంతో వెనుక వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొని బోల్తాపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ చాంద్‌బీ అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిని ముగ్గురు గాయపడడంతో చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ లోకేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహా గురుకులం..

ప్రారంభానికి సిద్ధం

- రూ.21 కోట్లతో భవనాల నిర్మాణం
- 5 నుంచి 10 వరకు ఇంగ్లిషు మీడియంలో బోధన
- 1000 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం


తోట్లపల్లెలో నూతనంగా నిర్మించిన మహాగురుకుల పాఠశాల భవనం


భోజనశాల


క్వార్టర్స్

బ్రహ్మంగారిమఠం : ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో మొట్టమొదటగా మహా గురుకుల పాఠశాల ఏర్పాటైంది. ఇందుకోసం బ్రహ్మంగారిమఠం మండలం తోట్లపల్లె దగ్గర రూ.21 కోట్లతో నూతన భవనాలు నిర్మించారు. 2016లో ప్రభుత్వం మహాగురుకుల పాఠశాల మంజూరు చేసింది. మొదట నాబార్డు నిధుల ద్వారా చెల్లింపు ఉంటాయన్నారు. కొన్ని కారణాల చేత నాబార్డు తొలగిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ నిధుల ద్వారా భవన నిర్మాణ పనులు చేపట్టారు. బి.మఠం జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డికి చెందిన కంపెనీ పనులను దక్కించుకోగా, కాంట్రాక్టర్ బోయిల్లవారిపల్లె శేఖర్‌రెడ్డి చేశారు. ఈ నెలలోనే పాఠశాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అధికారులను ఆదేశించారు.

అధునాతన సౌకర్యాలు

నూతన పాఠశాల భవనంలో 1000 మంది విద్యార్థులు 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకునే అవకాశం ఉంది. అధునాతన హాస్టల్, భోజనశాల, లైబ్రరీ, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్, వాచ్‌మెన్లకు అన్ని సౌకర్యాలతో క్వార్టర్స్, విద్యార్థులకు విశాలమైన ఆట స్థలం ఏర్పాటు చేశారు.

మూడేళ్లుగా..

మూడేళ్లుగా మహాగురుకుల పాఠశాలను అధికారులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 125 మంది పిల్లలు బి.మఠంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. అక్కడ ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధనతోపాటు వసతులు ఏర్పాటు చేస్తున్నారు.

ఇతర జిల్లాల విద్యార్థులు చేరవచ్చు

నూతన మహాగురుకుల పాఠశాలను ప్రారంభిస్తే.. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరగాలి. అలాగే దాదాపు 25 మంది ఉపాధ్యాయులు, ఒక ప్రిన్సిపాల్, ఐదుగురు నాన్‌టీచింగ్ ఉద్యోగులు, ముగ్గురు వాచ్‌మెన్లు కావాల్సి ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. మన జిల్లా నుంచే కాకుండా ఉమ్మడి అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన పేద విద్యార్థులు ఇక్కడ చదువుకొనే అవకాశం ఉంది. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి స్పందించి వచ్చే విద్యాసంవత్సరానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య పెరిగేలా అధికారులపై ఒత్తిడి తేవాల్సి ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

సీఏ విద్యార్థిని ఆత్మహత్య

ఈ సారైనా పాస్ అవుతావా అని అడిగినందుకు..


స్వాతి (ఫైల్)

పెద్దతిప్పసముద్రం : కష్టపడి పొలం పనులు చేసుకుని జీవనం సాగించే ఓ రైతు కుటుంబం.. తమ పిల్లలను బాగా చదివించాలనుకుంది. ఈ పరిస్థితి తమ బిడ్డలకు వద్దు, భవిష్యత్తులో వారు బాగా స్థిరపడితే చాలనుకుంది. 'పరీక్షలు ఈ సారైనా పాస్ అవుతావా' అని అడిగినందుకు జీవితంపై విరక్తి చెందిన స్వాతి (21) అనే విద్యార్థిని క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంది. కన్నవారి ఆశలను అడియాసలు చేసి కుటుంబాన్ని తీవ్ర విషాదంలో నింపింది. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రవీంద్రబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్లెల గ్రామానికి చెందిన బలక రమేష్, సునీత దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం. పొలం పనులు చేసుకుని పిల్లలను చదివించేవారు. పెద్ద కుమార్తె స్వాతి (21) గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర ఫౌండేషన్ కళాశాలలో సీఏ చదువుతుండగా, రెండో కుమార్తె బీటెక్, చిన్న కుమారుడు 6వ తరగతి చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో సీఏ చదువు పూర్తి చేసుకున్న పెద్ద కుమార్తె స్వాతి గుంటూరు నుంచి 15 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చింది. ఈ తరుణంలో గురువారం సాయంకాలం నీ చదువు కోసం రూ.లక్షలు ఖర్చు చేశాం, పరీక్షలు బాగా రాశావా తల్లీ, గతంలో లాగా కాకుండా ఈ సారైనా పాస్ అవుతావా అని కన్నవాళ్లు స్వాతిని ప్రశ్నించారు. లేకుంటే మంచి సంబంధం చూసి వివాహం జరిపిస్తామని సున్నితంగా సూచించారు. సదరు యువతి ఏమనుకుందో ఏమో, పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమో, లేదా కన్నవాళ్ల ఆశలు నెరవేర్చలేనేమో అని అనుకుందో గాని క్షణికావేశంలో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. నోట్లో నురగతో అచేతనంగా పడి ఉన్న కుమార్తెను చూసిన కన్నవాళ్లు బోరున విలపించారు. హుటాహుటిన బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్ల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో అర్ధరాత్రి సమయంలో తనువు చాలించింది. మృతురాలి చిన్నాన్న కుమారుడు శ్రీనివాసులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శుక్రవారం వెల్లడించారు.

స్కూటీ చోరీ

నందలూరు (రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లె దళితవాడలో శుక్రవారం హోండా యాక్టీవా స్కూటీ చోరీ జరిగింది. ఈ వాహనం అరవపల్లెలోని శ్రీ కృష్ణగీతా మందిరం సమీపంలోని టిఫిన్ సెంటర్ నడుపుతున్న మణికి చెందినది. ఈ చోరీ జరిగిన తీరు మొత్తం సంఘటనా స్థలంలో ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డు (నిక్షిప్తం) అయింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సవాళ్లు అధిగమించాలి

ప్రొద్దుటూరు : రాయలసీమ అస్తిత్వ పోరాటానికి సవాళ్లు ఎదురవుతున్నాయని, ఆ సవాళ్లను అధిగమించడానికి చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి అన్నారు. ప్రొద్దుటూరులోని సృజన సామాజిక వేదిక కార్యాలయంలో 'నీటి అవగాహన, రాయలసీమకు రక్ష' పుస్తకావిష్కరణ సభకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి రాసిన 'నీటి అవగాహన, రాయలసీమకు రక్ష' అనే పుస్తకంలో నీటి లెక్కలతో సహా వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన సమగ్ర సమాచారం ఉందన్నారు. రాయలసీమ వెనుకబాటుకు ముఖ్య కారణం ప్రజలకు అవగాహన కొరవడటమేనన్నారు. రాజకీయ అవసరాల కోసం తప్ప ప్రజా సంక్షేమం, ప్రాంత సమగ్ర అభివృద్ధి పట్ల పార్టీలకు స్పష్టత లేదన్నారు. రాయలసీమ ఉద్యమం ఈ ప్రాంత వెనుకబాటుతనంపై విస్తృత అవగాహనను పెంపొందించిందన్నారు. దీనిని గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా దశరథరామిరెడ్డి రచించిన 'నీటి అవగాహన, రాయలసీమకు రక్ష' పుస్తకావిష్కరణ సభను ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని స్త్రీశక్తి భవన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ హమీద్, రాష్ట్ర కో-కన్వీనర్ మహమూద్, సృజన సామాజిక వేదిక అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, పౌరహక్కుల కమిటీ సభ్యుడు సురేష్, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తవ్వా సురేష్ రెడ్డి, రాయలసీమ విద్యార్థి శక్తి కార్యదర్శి హరిత, రాయలసీమ మహిళా శక్తి కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, చైతన్య మహిళా సంఘం కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యవస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సొంతింటి కల నెరవేరింది



బస్టాండ్‌లో మూటలు మోసుకుని జీవనం సాగిస్తున్నాను. దినసరి కూలీ పనులే మా కుటుంబానికి జీవనధారం. అలాంటి మాకు సొంతిల్లు లేక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. మా పేదల పాలిట దేవుడిగా జగనన్న.. మాకు ప్రభుత్వ స్థలంతోపాటు గృహం కూడా మంజూరు చేశారు. పనులు పూర్తి కాగానే బిల్లులు కూడా మంజూరు చేయడం ఆనందంగా ఉంది.

- సయ్యద్ బాషా, కందుకూరు, పెద్దతిప్పసముద్రం మండలం

రేషన్‌కార్డులో పిల్లలను చేర్చారు



మాది సీ గొల్లపల్లె పంచాయతీలోని రెక్కల కొండపల్లె. వ్యవసాయం, కూలీ పనులతో జీవనం సాగిస్తున్నాం. కుటుంబంలో నేను, నా భార్య, ఇద్దరు బిడ్డలు ఉన్నాం. నాకు, నా భార్యకు మాత్రమే రేషన్‌కార్డు ఉండేది. ఇద్దరు బిడ్డలను కార్డులో చేర్చాలని అనుకున్నాం. ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్‌లు సర్వే చేశారు. కార్డులో ఇద్దరు పిల్లలను రేషన్ కార్డులో చేర్చాలని వలంటీర్‌కు చెప్పాను. ప్రత్యేక కార్యక్రమంలో రేషన్‌కార్డులో ఇద్దరు పిల్లలను చేర్చారు. అధికారుల చేతుల మీదుగా ఉచితంగా రేషన్‌కార్డులో నా ఇద్దరు పిల్లలను చేర్చి కార్డు ఇవ్వడంతో చాలా సంతోషంగా ఉంది.

- ఎన్.నాగరాజు, రెక్కలకొండపల్లె, సీ గొల్లపల్లె పంచాయతీ, పెద్దమండ్యం

గతంతో పోలిస్తే ఎంతో అభివృద్ధి



గత 40 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాను. అప్పటికి ఇప్పటికి చాలా తేడా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల పట్ల శ్రద్ధ చూపి అభివృద్ధి చేయడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం పట్ల విధులు నిర్వహించే మాకు చాలా ఆనందంగా ఉంది. గతంతో పోలిస్తే ఎంతో అభివృద్ధి జరిగింది.

- నాగోలు నర్సరామిరెడ్డి, ఉపాధ్యాయుడు, రాఘవరాజుపురం ప్రభుత్వ పాఠశాల, రైల్వేకోడూరు మండలం

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేశప్ప


నారాయణస్వామి (ఫైల్)

మదనపల్లె : హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష ఖరారు చేస్తూ శుక్రవారం మదనపల్లె రెండవ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి అబ్రహాం తీర్పునిచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ కేశప్ప రూరల్ సీఐ శివాంజనేయులుతో కలిసి రూరల్ సర్కిల్ కార్యాలయంలో విలేకర్లకు తెలిపారు. మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండలం కాప్పల్లె పంచాయతీ మరవ జంగాలపల్లెకు చెందిన నాగప్ప కుమారుడు బుడ్డ శ్రీనాథ(29).. 2016 జూన్ 22వ తేదీన హత్యకు గురయ్యాడు. శ్రీనాథ తనకు వరుసకు బావమరిది అయిన అదే గ్రామానికి చెందిన వరదప్ప కుమారుడు నారాయణస్వామి అలియాస్ నారాయణ భార్యతో సన్నిహితంగా ఉండేవాడు. దీంతో అనుమానం పెంచుకున్న నారాయణ, ఇదే విషయమై పలు పలుమార్లు శ్రీనాథను హెచ్చరించాడు. అయినా మాట వినకపోవడంతో కక్ష పెంచుకుని పథకం ప్రకారం నారాయణస్వామి నీతో మాట్లాడాలంటూ శ్రీనాథకు ఫోన్ చేసి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్దకు రప్పించాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం శ్రీనాథ తలపై బండతో మోది హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి జారుకున్నాడు. గ్రామంలో శ్రీనాథ మృతదేహం లభించడంతో, మృతుని తల్లి బుడ్డ నరసమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి పుంగనూరు సీఐ రవీంద్ర క్రైమ్ నంబర్ 35/ 2016గా కేసు నమోదు చేశాడు. 2016 జూన్ 25వ తేదీన నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. కేసు విచారణ అనంతరం సాక్షధారాల మేరకు మదపల్లె రెండవ అదనపు సెషన్స్ కోర్టు జడ్జి అబ్రహాం నిందితుడు నారాయణస్వామి అలియాస్ నారాయణకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ, రూ.2000 జరిమానా చెల్లించాలని తీర్పు వెలువరించారు. కేసును అడిషనల్ పీపీ జనార్ధన్‌రెడ్డి వాదించారు. రూరల్ సీఐ శివాంజనేయులు, ఎస్ఐ చంద్రశేఖర్, సతీష్, రుద్రలను డీఎస్పీ కేశప్ప అభినందించారు. అధిక నేర తీవ్రత కలిగిన కేసులను సత్వరం పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ చెప్పారు.

ఎన్‌హెచ్ పెండింగ్ పనులు పూర్తయ్యేనా?

- గుర్రంకొండలో పెండింగ్‌లో డ్రైనేజీ పనులు
- పట్టణంలో రెండేళ్లుగా పూర్తి కాని లింకు రోడ్లు


మార్కెట్ యార్డు సర్కిల్‌లో మురుగునీటి కాలువ పైకప్పు దెబ్బతినడంతో ఏర్పడిన రంధ్రాలు


బస్టాండులో పూర్తి కాని డ్రైనేజ నిర్మాణ పనులు

గుర్రంకొండ : జాతీయ రహదారి (ఎన్‌హెచ్) 340 నిర్మాణ పెండింగ్ పనులు పూర్తి కాకపోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. గుర్రంకొండ బస్టాండులో డ్రైనేజీ వ్యవస్థ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంది. జాతీయ రహదారి నుంచి పట్టణంలోని ప్రధాన వీధులకు పెండింగ్‌లో ఉన్న లింకు రోడ్ల నిర్మాణ పనులు రెండేళ్లయినా పూర్తి కాలేదు.

పెండింగ్‌లో కాలువ నిర్మాణ పనులు

పట్టణంలోని బస్టాండు పరిధిలో ఎన్‌హెచ్ 340 రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా చేపట్టి మురుగునీటి కాలువల నిర్మాణ పనులు కొన్ని చోట్ల పూర్తి చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. మురుగునీటి కాలువ నిర్మాణాలు రెండేళ్లుగా అక్కడక్కడా పెండింగ్‌లో ఉంచారు. మూడు నుంచి నాలుగు మీటర్ల దూరంలో అక్కడక్కడా మురుగునీటి కాలువలు నిర్మించలేదు. దీంతో నెలల తరబడి పనులు పూర్తి కాక పోవడంతో బస్టాండులోని వ్యాపారస్తులకు చాలా ఇబ్బందిగా మారింది. దుకాణాల ముందు భాగంలో కాలువ నిర్మాణ కోసం తవ్వేసి వదిలేయడంతో ప్రజలు దుకాణాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని మురుగునీటితో పాటు వర్షపునీరు బయటకు వెళ్లే మార్గంలేక ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో కడప–బెంగళూరు జాతీయ రహదారి మురుగునీటిమయంగా మారింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతోపాటు పాదచారులు రోడ్లపైన నడవలేక నానా కష్టాలు పడుతున్నారు.

కూలిపోతున్న మురుగునీటి కాలువలు

పట్టణంలోని పలు చోట్ల ఎన్‌హెచ్ 340 రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మించిన మురుగునీటి కాలువలు దెబ్బతిని కూలిపోయాయి. స్థానిక మార్కెట్ యార్డు సర్కిల్లో రెండు చోట్ల కాలువ పైకప్పు దెబ్బతిని పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. స్థానిక నవాజ్ సినిమా హాల్ పరిసరాల్లో రెండు చోట్ల కాలువ దెబ్బతిని పెద్ద ఎత్తున రంధ్రాలు ఏర్పడ్డాయి. పట్టణంలో పలు చోట్ల కాలువలపై ఇదే పరిస్థితి నెలకొంది.

పూర్తి కాని లింకు రోడ్లు

ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి నుంచి పట్టణంలోని పలు వీధులను కలుపుతూ గతంలో లింకు రోడ్లు వేయడానికి పనులు చేపట్టారు. అయితే రెండేళ్లుగా పనులు ముందుకు సాగక పెండింగ్‌లో ఉంచారు. దీంతో రోడ్లు మొత్తం కంకర తేలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు కలుగుతున్నాయి. ఇటు రోడ్డు కాంట్రాక్టర్లు, అటు అధికారులు వీటిపై దృష్టి సారించడం లేదు. లింకు రోడ్డు పనులు పూర్తి చేసి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గుర్రంకొండ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులు కూడా త్వరగా పూర్తి చేయిస్తాం. కొద్ది రోజులుగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సబ్ కాంట్రాక్టర్లతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తాం.

- వెంకటరమణారెడ్డి, ఎన్‌హెచ్ 340 ఏఈ, మదనపల్లె

సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి

ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : రాజంపేటలో ఈ నెల 12వ తేదీన జరిగే సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను తెలుగుదేశం పార్టీ బ్యాక్‌వర్డ్ కులాలుగానే చూసిందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ వర్గాల ప్రజలకు పదవులు ఇచ్చి గౌరవిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రతి మండలంలో వెనకబడిన వర్గాల ప్రజలకు పదవులిచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొన్ని సామాజిక వర్గాలకే ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. అయితే జగన్ ఇప్పటి వరకు పదవులు దక్కని వర్గాలకు కూడా పదవులిచ్చి సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. అందువల్ల రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు జగన్‌వైపే ఉన్నారన్నారు. ఎక్కడ సామాజిక సాధికార యాత్ర జరిగినా ఆ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా వేలాదిగా తరలి వస్తున్నారన్నారు. రాజంపేటలో జరిగే సామాజిక సాధికార యాత్రను ప్రతి గ్రామంలో తెలియజేసి, యాత్ర దిగ్విజయమయ్యేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, వీరబల్లి, సుండుపల్లె మండలాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ములకలచెరువు : ములకలచెరువు మండలం కదిరినాధునికోట పంచాయతీ నాయనవారిపల్లికి చెందిన అజ్మీర్ (47) సుమారు 20 సంవత్సరాలుగా ములకలచెరువులో హోటల్ నడుపుకుంటూ, కోళ్లఫారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం సాయంత్రం సొంత పని మీద తన గ్రామనికి వెళ్లి వస్తుండగా స్థానిక కేజీఎస్ కల్యాణ మండపం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు.

ఘటన స్థలానికి ఎస్సై గాయత్రి చేరుకొని బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి, తర్వాత తిరుపతి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.